
సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం ❘ 22 ❘ ఫిబ్రవరి ❘ 2024



కష్టాలు తీర్చేలా అగ్రి ల్యాబ్‌లు

ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను మంజూరు చేసిందని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. 8లో ▸



ఉద్యానానికి ఊతం

ఉద్యాన పంటలను సాగు చేసే రైతులకు ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలు అందిస్తోంది. పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు చర్యలు తీసుకుంది. 8లో ▸



గ్రంథాలయాలతో స్వీయ అధ్యయనం

స్వీయ అధ్యయనం ద్వారా విజ్ఞానాన్ని పెంచుకోవడానికి గ్రంథాలయాలు దోహదపడతాయని ఏలూరు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. 8లో ▸

రైతు సేవా నిలయం

అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా.. వ్యవసాయాన్ని పండగ చేయడమే ధ్యేయంగా.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు పెద్దపీట వేస్తున్నారు. విత్తు నుంచి పంట విక్రయాల వరకూ అడుగడుగునా అండగా ఉంటున్నారు. గ్రామస్థాయిలోనే రైతులకు సేవలందించేలా రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకే) ఏర్పాటుచేసి సాగులో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. పశ్చిమగోదావరి జిల్లాలోని 253 పంచాయతీల పరిధిలో 298 ఆర్‌బీకేల నిర్మాణాలు చేపట్టగా ఇప్పటికే 211 భవనాలు వినియోగంలోకి వచ్చాయి. గ్రామాల్లో అభివృద్ధికి ఆనవాళ్లుగా ఈ భవనాలు నిలుస్తున్నాయి.



నీలాద్రిపురంలో రైతు భరోసా కేంద్రం

అన్నదాతకు అగ్రాసనం

- రైతు భరోసా కేంద్రాలతో సరికొత్త అధ్యాయం
- పక్కా భవనాలతో మరింత మెరుగైన సేవలు
- జిల్లాలో 298 ఆర్‌బీకే భవనాలు
- ఇప్పటికే 211 నిర్మాణాలు పూర్తి



భట్లమగుటూరు ఆర్‌బీకేలో కియోస్కో ద్వారా ఎరువులు బుక్ చేసుకుంటున్న రైతులు (ఫైల్)



సాక్షి, భీమవరం: గతంలో విత్తనాలు, ఎరువులు కావాలన్నా, రైతులకు ఏ అవసరమొచ్చినా మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. కిలో మీటర్ల దూరంలోని గోదాముల నుంచి ఎరువులు తెచ్చుకునేందుకు రవాణా భారం తడిసిమోపెడయ్యేది. రైతులకు వ్యయప్రయాసలు తగ్గించేలా, సత్వరమే సేవలందించేలా సీఎం జగన్ రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుకు సంకల్పించారు. వ్యవసాయ, అనుబంధ రంగాల సేవలను గ్రామ స్థాయిలోనే అందించే లక్ష్యంతో ప్రతి గ్రామంలో వీటిని ఏర్పాటుచేస్తున్నారు. సబ్సిడీపై విత్తనాలు, ఎరువులతో పాటు కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట నష్టం వాటిల్లితే బీమా పరిహారం అందించడంలో ఇవి అన్నదాతలకు అండగా నిలుస్తున్నాయి. సాగు కాలంలో రైతుకు రవాణా, కూలీ ఖర్చుల రూపంలో వేలాది రూపాయలు ఆదా చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది ఆర్‌బీకే వ్యవస్థ. వీటిని తమ రాష్ట్రాల్లో ఏర్పాటు చేసే దిశగా రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, ఇతర రాష్ట్రాలకు చెందిన ఉన్నతాధికారుల బృందాలు ఆర్‌బీకేలను సందర్శించాయి.

రూ.65 కోట్ల నిధులతో..

పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో జిల్లాలో 253 పంచాయతీల పరిధిలో రూ.65 కోట్లతో 298 భవన నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటికే 211 భవనాలు వినియోగంలోకి వచ్చి రైతులకు సేవలందిస్తున్నాయి. ఒక వరండా, సిబ్బంది కోసం రెండు గదులు, రైతులతో సమావేశాల నిర్వహణ కోసం విశాలమైన హాలుతో భవనాలను డిజైన్ చేశారు. వరండాలో ప్రభుత్వ పథకాలకు సంబంధించిన వివరాలు, అర్హులు, అనర్హుల జాబితాల డిస్‌ప్లే, రాయితీపై ఇచ్చే విత్తనాలు, బయో ఫెర్టిలైజర్స్, ఇతర ఎరువులు, మరోవైపు భూసార పరీక్షల నమూనా తదితరాలను ప్రదర్శించడం, హాల్లో కియోస్కో, లైబ్రరీ ర్యాక్స్, రైతులు కూర్చుని చదువుకునేందుకు వ్యవసాయ సమాచారం అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లుచేశారు.

రైతు సేవలో కియోస్కోలు

రైతులు విత్తనాలు, ఎరువులు తదితర వాటిని కియోస్కో ద్వారా బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. భీమవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని 71 పంచాయతీల్లో 79 భవనాలు, తాడేపల్లిగూడెం డివిజన్‌లోని 78 పంచాయతీల్లో 92, నరసాపురం డివిజన్‌లోని 104 పంచాయతీల్లో 127 ఆర్‌బీకేలు ఉన్నాయి. ఇప్పటికే భీమవరంలో 52, తాడేపల్లిగూడెంలో 66, నరసాపురంలో 93 భవన నిర్మాణాలు పూర్తయి రైతులకు సేవలు అందిస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు మిగిలిన వాటిని త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని పంచాయతీరాజ్ శాఖ అధికారులు తెలిపారు.

రైతు భరోసా కేంద్రం భవనాలు

నియోజకవర్గం	పంచాయతీల సంఖ్య	ఆర్‌బీకే భవనాలు	నిర్మాణ వ్యయం రూ.కోట్లలో..	పూర్తయిన భవనాలు
భీమవరం	21	22	4.58	16
ఆచంట	26	35	7.63	19
పాలకొల్లు	47	53	11.55	39
నరసాపురం	31	39	8.50	35
తాడేపల్లిగూడెం	39	43	9.37	35
తణుకు	39	49	31.00	31
ఉండి	35	38	24.80	24
గణపవరం (మం)	15	19	4.14	12



మట్టి నమూనాలు సేకరిస్తున్న దృశ్యం (ఫైల్)

ఆర్‌బీకేల సేవలు

- నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అందుబాటులో ఉంచడం.
- పంట నమోదు ద్వారా ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ రుణాలు అందించడం.
- అర్హులైన రైతులకు రైతు భరోసా, పీఎం కిసాన్, కౌలు రైతు భరోసా పథకాల నమోదు.
- ధాన్యం కల్లం వద్ద నుంచి మిల్లుకు చేరే వరకూ దళారుల బెడద లేకుండా రైతులకు సహకారం.
- పంట కోత ప్రయోగాలు, పంట నష్టపోతే బీమా అంచనాలు ప్రభుత్వానికి నివేదించడం.
- కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, రుణాల మంజూరు.
- వైఎస్సార్ పొలంబడి ద్వారా రైతులకు సూచనలు, సలహాలు అందించడం.
- తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించేలా చైతన్యవంతం చేయడం.
- సమస్యలు గుర్తించేందుకు ప్రతినెలా గ్రామ వ్యవసాయ సహాయక మండలి సమావేశం నిర్వహణ.
- ప్రతి సీజన్‌లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టడం.
- వైఎస్సార్ యంత్ర సేవ పథకం ద్వారా రైతులకు యంత్ర సామగ్రిని అందజేయడం.



యంత్ర పరికరాలు అందుకుంటున్న రైతులు (ఫైల్)

ఆర్‌బీకేల ద్వారానే అన్ని సేవలు



నేను 1.80 ఎకరాలు సాగు చేస్తున్నాను. ఆర్‌బీకే ద్వారానే అన్నిసేవలు అందించడం చాలా బాగుంది. విత్తనాలు, ఎరువులు వాటి ద్వారానే తీసుకుంటున్నాం. ప్రతి పంటకు విధిగా రైతు భరోసా పడుతుంది. పంట నష్టపోయినప్పుడు ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా సొమ్ములు సకాలంలో అందుతున్నాయి.

– కోళ్ల సత్యనారాయణ, రైతు, చిట్టవరం, నరసాపురం మండలం

చాలా ప్రయోజనకరం



గ్రామాల్లో ఆర్‌బీకేలు ఏర్పాటు చేసి సొంత భవనాలు నిర్మించడం అభినందనీయం. ఇవి రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయి. ప్రాతళ్లమెరక సచివాలయ పరిధిలో రైతు భరోసా కేంద్రం నిర్మించడం వల్ల పల్లిపాలెం, ప్రాతళ్లమెరక గ్రామాల రైతులకు సేవలు సులభమయ్యాయి.

– బొడ్డు రామకృష్ణ, పల్లిపాలెం, కాళ్ల మండలం

యువతకు ఉద్యోగాలు



సీఎం జగన్ సార్ సచివాలయ, ఆర్‌బీకే వ్యవస్థల ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించారు. అగ్రికల్చర్ పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసిన నాకు ఎంపీఈఓగా ఉద్యోగం వచ్చింది. రైతులకు సేవలందించే అవకాశం లభించడం చాలా ఆనందంగా ఉంది.

– పి.మధు, ఎంపీఈఓ, కొణితివాడ, వీరవాసరం మండలం

న్యూస్‌రీల్

మిరప ఎగుమతుల్లో ముందంజ



మాట్లాడుతున్న ఉద్యాన వర్సిటీ వీసీ

తాడేపల్లిగూడెం: మిరప ఉత్పత్తి, ఉత్పాదకత, ఎగుమతుల్లో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. వెంకట్రామన్నగూడెంలోని వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్ వైఎస్సార్‌హెచ్‌యు ఇయర్ ఆఫ్ చిల్లీ 2023–24 కార్యక్రమాన్ని వర్చువల్‌గా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ మిరపలో అధిక దిగుబడులనిచ్చే 21 వంగడాలను విడుదల చేయడంతో పాటు, రైతులకు సాంకేతికతను చేరువ చేస్తున్న శాస్త్రవేత్తలను అభినందించారు. మిరపలో ప్రాసెసింగ్‌కు అనువైన రకాలను అభివృద్ధి చేయాలని, పురుగు మందుల అవశేషాలు వల్ల రాష్ట్ర ఎగుమతులు వెనక్కి వస్తున్నాయని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అధ్యక్షత వహించిన వర్సిటీ ఉపకులపతి టి.జానకిరామ్ మాట్లాడుతూ మిరపలో చీడపీడలను తట్టుకునే క్రాంతి, తన్వి, చైత్ర వంటి ఎన్నో అధిక దిగుబడినిచ్చే వంగడాలను అభివృద్ధి చేసి విడుదల చేశామన్నారు. మిరపలో పురుగు మందుల అవశేషాల పరీక్షించడానికి, పరిశోధనకు ప్రయోగశాలను లాంఫారంలో నెలకొల్పామన్నారు. ఉద్యాన శాఖ సంచాలకులు ఎస్ఎస్ శ్రీధర్, జాతీయ కూరగాయల పరిశోధనా సంస్థ డైరెక్టర్ టీకే బెహరా, అఖిల భారత కూరగాయల సమన్వయ పథకం అధిపతి రాజేష్‌కుమార్, సంచాలకులు ఎల్.నారం నాయుడు, విస్తరణ సంచాలకులు ఈ.కరుణశ్రీ మాట్లాడారు. అనంతరం వార్షిక కార్యాచరణ ప్రణాళిక వివరాలను వెల్లడించారు.

అద్దె బస్సులకు టెండర్ల ఆహ్వానం

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో అద్దె ప్రాతిపదికన 10 బస్సుల కోసం టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.వీరయ్యచౌదరి ప్రకటనలో తెలియజేశారు. వచ్చేనెల 6న సాయంత్రం వరకు టెండర్ల దాఖలకు అవకాశం ఉందని పేర్కొన్నారు. వచ్చేనెల 14న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రివర్స్ టెండరింగ్ ప్రక్రియ నిర్వస్తామని తెలిపారు. వివరాలకు http//apsrtc.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. తాడేపల్లిగూడెంలో 1, భీమవరంలో 6, నరసాపురంలో 2, తణుకులో 1 చొప్పున బస్సులకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

పల్స్ పోలియోపై సమీక్ష

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం పల్స్ పోలియో కార్యక్రమంపై అర్బన్ స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ మహేశ్వరరావు మాట్లాడుతూ వచ్చేనెలలో జరిగే పల్స్ పోలియోను విజయవంతం చేయాలని వైద్యులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

ఎన్నికల కోడ్ పక్కాగా అమలుచేయాలి

కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

భీమవరం (ప్రకాశంచౌక్): ఎన్నికల కోడ్‌ను అధికారులు ఎటువంటి పక్షపాతం లేకుండా అమలు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం సార్వత్రిక ఎన్నికల ప్రవర్తన నియమావళిపై అధికారులతో ఏర్పాటు చేసిన ఒకరోజు శిక్షణా తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు కీలకమన్నారు. నోటిఫికేషన్ విడుదలైన వెంటనే ఎంసీసీ అమల్లోకి వస్తుందని, కౌంటింగ్ పూర్తయ్యేవరకు అమలు చేయాలన్నారు. రాజకీయ పార్టీలు ప్రచారాన్ని ఎన్నికలకు 48 గంటలలోపు కచ్చితంగా ముగించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలకు కోడ్ వర్తిస్తుందన్నారు. కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో ఉన్న రాజకీయ పార్టీల నాయకుల ఫొటోలను, సంక్షేమ పథకాల ఫ్లెక్సీలను కచ్చితంగా తొలగించాలన్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలను వస్త్రంతో మూసి ఉంచాలన్నారు. హెలీప్యాడ్స్, ఫంక్షన్ హాల్స్ వినియోగించుకునేందుకు అన్ని పార్టీలకు సమాన అవకాశాలు ఇవ్వాలన్నారు. పార్టీలు ప్రలోభాలకు పాల్పడుతున్న సమాచారం అందితే వెంటనే తనిఖీ చేసి, వస్తువులను సీజ్ చేయడంతో పాటు సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేయాలని సూచించారు. జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కేసీహెచ్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లపై విమర్శలు తగదు

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



వలంటీర్లకు చెక్కు అందిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు, ఎంపీ అభ్యర్థి ఉమాబాల

పెనుగొండ: రాష్ట్రంలో పారదర్శకంగా పేదలకు సేవలందిస్తున్న వలంటీర్లపై మానవత్వాన్ని మరచి చంద్రబాబు, పవన్‌లు విమర్శలు చేస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు మండిపడ్డారు. బుధవారం ఆచంట రామేశ్వరస్వామి సత్రంలో నియోజకవర్గ స్థాయిలో వలంటీర్లకు సేవా పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతికి తావులేకుండా సంక్షేమాన్ని అమలు చేస్తున్న ఘనత వలంటీర్లకే దక్కుతుందని, దీనిని చూసి ఓర్వలేక ఈ వ్యవస్థపై బురద చల్లుతున్నారన్నారు. వలంటీర్లు సీఎం జగన్ మానస పుత్రులన్నారు. రాష్ట్రంలో, నియోజకవర్గంలో వార్ వన్‌సైడ్ అన్నారు. కుప్పంలోనూ చంద్రబాబు ఓటమి పాలవతారన్న భయంతో భార్య భువనేశ్వరి పోటీ చేయడానికి సన్నద్ధమవుతున్నారన్నారు. 15 ఏళ్లుగా గడప తొక్కని నాయకులు నేడు పాదయాత్ర చేయాల్సిన అగత్యం ఏర్పడిందన్నారు. ఒంటరిగా రాలేని వారు పొత్తులతో ఓడించాలని కలలు కంటున్నారన్నారు. ఎవరెన్ని యత్నాలు చేసినా వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేరన్నారు. వైఎస్సార్‌సీపీ నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలను సీఎం జగన్ సొంత కుటుంబంలా చూస్తున్నారని, అలాగే ఆచంట నియోజకవర్గంలో ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు ప్రజలకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. 2014లో హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు డ్వాక్రా మహిళలను, రైతులను మోసం చేశారని, మరోసారి మోసం చేయడానికి సిద్ధమవుతున్నారని, ప్రజలంతా బుద్ధి చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి (వాసు), జెడ్పీటీసీ కర్రి గౌరీ సుభాషిణి, నియోజకవర్గ వలంటీర్ల కన్వీనర్ మేడపాటి అనురాధ, ఆచంట, పెనుగొండ మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, దండు పద్మావతి, శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ మామిడిశెట్టి కృష్ణవేణి, సర్పంచ్‌లు కోట సరోజినీ వెంకటేశ్వరరావు, జక్కంశెట్టి చంటి, సువర్ణరాజు, బోడపాటి బుల్లియ్య, జక్కంశెట్టి శ్రీరాములు, రామన వీర్రాజు, మామిడిశెట్టి ధనలక్ష్మి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

డీఈఓ వెంకటరమణ

పోడూరు: 10వ తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని డీఈఓ ఆర్.వెంకటరమణ హైస్కూలు హెచ్‌ఎంలకు సూచించారు. స్థానిక కల్నల్ డీఎస్‌రాజు జెడ్పీ హైస్కూల్లో బుధవారం పాలకొల్లు, పోడూరు, ఆచంట, పెనుగొండ మండలాలకు చెందిన హైస్కూలు హెచ్‌ఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. టెన్త్ పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులంతా కృషి చేయాలన్నారు. అలాగే పబ్లిక్ పరీక్షలంటే కొందరు విద్యార్థులు ఒత్తిడి, భయానికి లోనవుతున్నారనీ, అటువంటి వారిని గుర్తించి వారిలో ఆత్మస్థైర్యం నింపాలన్నారు. అనంతరం హైస్కూల్ ప్రాంగణంలో టెన్త్ విద్యార్థులకు ఆయన సూచనలిచ్చారు. సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండాలన్నారు. ఎంఈఓలు జీవీ విజయకుమార్, జీవీ సూర్యనారాయణ, జి.వీరాస్వామి, రాజేంద్రప్రసాద్, జె.ఉషారాణి పాల్గొన్నారు.

తీరంలో రహదారులకు మహర్దశ

- రూ.93 కోట్లతో రోడ్ల నిర్మాణాలు
- వేగంగా సాగుతున్న పనులు
- మత్స్య, కొబ్బరి ఎగుమతులకు ఊతం



ముత్యాలపల్లి–మోళ్లపర్రు బీచ్ రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం



కాళీపట్నం పడమర–పాతపాడు రోడ్డు పనులు

నరసాపురం: నరసాపురం సముద్ర తీర గ్రామాల్లో సుమారు రూ.93 కోట్లతో చేపట్టిన రహదారుల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. ఆర్‌అండ్‌బీ నిధులతో చేపట్టిన రోడ్డు పనులు వేసవి ముగిసే లోపు పూర్తిచేయాలనే లక్ష్యంతో అధికారులు పని చేస్తున్నారు. ఇప్పటికే కొన్నింటికి టెండర్ల ప్రక్రియ ముగిసి పనులు ప్రారంభం కాగా.. మరి కొన్నింటికి టెండర్ల ప్రక్రియను వేగవంతం చేశారు. ముఖ్యంగా తీర గ్రామాలను అనుసంధానం చేస్తూ రోడ్లను అభివృద్ధి చేస్తున్నారు. ఉభయగోదావరి జిల్లాల్లో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న పేరుపాలెం బీచ్‌కు అనుసంధానంగా పలు రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి.


మరింత మెరుగ్గా..

ఉమ్మడి జిల్లాలో 19 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉండగా ఇక్కడ నుంచి ఏటా రూ.300 కోట్ల వరకూ మత్స్య ఉత్పత్తులు జరుగుతుంటాయి. అలాగే కొబ్బరి ఎగుమతుల్లో కూడా తీర ప్రాంతం ప్రధానమైంది. మరో పక్క బియ్యపుతిప్పలో నిర్మించే ఫిషింగ్ హార్బర్ పనులు కూడా ప్రారంభం కానున్నాయి. రహదారుల అభివృద్ధితో హార్బర్ ప్రాంతానికి ప్రయాణ సౌలభ్యం మెరుగుకానుంది. అలాగే మత్స్య ఉత్పత్తులు, కొబ్బరి ఎగుమతులకు ఉపయోగకరంగా ఉంటుంది. ఇప్పటికే 216 జాతీయ రహదారి మొగల్తూరు మీదుగా ఒంగోలు వరకూ అందుబాటులోకి వచ్చింది. ఇక తీర ప్రాంతం నుంచి నేరుగా జాతీయ రహదారికి మార్గం సుగమం అవుతుంది. అలాగే తుపాన్లు, సునామీల వంటి ప్రకృతి విపత్తుల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించేలా చర్యలు తీసుకోవడానికి రవాణా సదుపాయాలు మరింత మెరుగు కానున్నాయి.

రోడ్ల నిర్మాణాలు ఇలా..

రహదారి	నిర్మాణ వ్యయం
లిఖితపూడి–మల్లవరం–పెదలంక	రూ. 2.00 కోట్లు
సీతారామపురం–కొప్పర్రు	రూ. 1.50 కోట్లు
చిట్టవరం–కాజ	రూ. 2.00 కోట్లు
పసలదీవి–రామన్నపాలెం–మొగల్తూరు	రూ. 1.70 కోట్లు
పీతానివారిమెరక–వైఎస్ పాలెం	రూ. 2.70 కోట్లు
లక్ష్మణేశ్వరం–పీఎం లంక	రూ. 2.00 కోట్లు
కొత్తోట–దెయ్యాలతిప్ప–నీటితిప్ప–మర్రితిప్ప	రూ. 9.00 కోట్లు
బియ్యపుతిప్ప–మోళ్లపర్రు (సముద్రమొగ) చిన్నమైనవాని లంక, పీఎం లంక, మెట్రీవు	రూ. 4.30 కోట్లు
నరసాపురం–కరింశెట్టివారిపాలెం	రూ. 3.00 కోట్లు
అల్లంవారిమెరక–కేపీపాలెం (వయా మెట్రీవు–బీచ్ రోడ్డు)	రూ. 8.00 కోట్లు
ముత్యాలపల్లి–మోడి–మోళ్లపర్రు	రూ.28.00 కోట్లు
పీతానివారిమెరక–వైఎస్ పాలెం	రూ. 1.00 కోటి
కాళీపట్నం–పాతపాడు–జగన్నాథపురం	రూ.12.00 కోట్లు
మొగల్తూరు–బేతపూడి వయా వెంప	రూ.12.64 కోట్లు
నరసాపురం–కరింశెట్టివారిపాలెం నరసాపురం–తూర్పుతాళ్లు	రూ. 3.00 కోట్లు
కొప్పర్రు–లంకలకోడేరు రుస్తుంబాద–కొప్పర్రు	రూ. 2.70 కోట్లు
పేరుపాలెం–కొత్తకాయలతిప్ప–మొగల్తూరు రాజుగారితోట–కొప్పర్రు	రూ. 2.50 కోట్లు
కొండావారిపాలెం–రాజుగారితోట	రూ. 1.10 కోట్లు

రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం



తీరంలో ప్రధాన రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. ఇక్కడ రోడ్ల అభివృద్ధికి ఇంత పెద్ద మొత్తంలో నిధుల విడుదల ఎన్నడూ లేదు. మత్స్య ఎగుమతులకు, పేరుపాలెం బీచ్, పర్యాటక రంగ అభివృద్ధికి ఈ రోడ్లు దోహదపడతాయి. విపత్తుల సమయంలో రాకపోకలకు మరింత వీలుంటుంది.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్


ముమ్మరంగా పనులు



మా గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. సీసీ రోడ్డు అందంగా నిర్మిస్తున్నారు. పాడైన రోడ్లను సీసీ రోడ్లుగా బాగుచేస్తున్నారు. ఇకపై మా గ్రామంలో రోడ్డు కష్టాలు ఉండవు. రోడ్లు వేయడం లేదని కొందరు కావాలని గగ్గోలు పెట్టి ప్రభుత్వాన్ని నిందిస్తున్నారు. అలాంటి వాళ్ల కళ్లు తెరవాలి.

– కపురు ఆదినారాయణ, కాళీపట్నం పడమర

బీచ్‌కు అనుసంధానంగా..



పేరుపాలెం బీచ్‌కు అనుసంధానంగా మంచి రోడ్డు వేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేరుపాలెం బీచ్ ఎంతగానో అభివృద్ధి చెందింది. పేరుపాలెం బీచ్‌కు అనుసంధానంగా ఇప్పుడు వేస్తున్న రహదారులతో మరింత అభివృద్ధి చెందుతుంది. మాకు చాలా ఆనందంగా ఉంది.

– దొంగ నాగముని, మొగల్తూరు

క్లుప్తంగా

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



చెక్‌పోస్ట్ వద్ద పట్టుబడిన బియ్యం లారీ, డ్రైవర్‌తో అధికారులు

బుట్టాయగూడెం: ఆంధ్రా–తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన జీలుగుమిల్లి మండలం తాటాకులగూడెం చెక్‌పోస్ట్ వద్ద స్థానిక పోలీసులు బుధవారం లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. అలాగే సమాచారాన్ని రెవెన్యూ అధికారులకు అందజేశారు. అక్రమంగా లారీల్లో తరలిస్తున్న రేషన్ బియ్యం సుమారు 215 క్వింటాళ్ల వరకూ ఉన్నాయని తెలిపారు. అలాగే వీటి విలువ సుమారు రూ. 3 లక్షల 87వేల వరకూ ఉంటుందని చెప్పారు. అలాగే లారీ విలువ రూ. 5 లక్షలు మొత్తం రూ. 8 లక్షల 87 వేల వరకూ ఉంటుందని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ నుంచి కాకినాడ జిల్లా బిక్కవోలుకు ఈ రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు లారీ డ్రైవర్ చెప్పినట్లు సివిల్ సప్లయిస్ డీటీ సురేంద్ర తెలిపారు. లారీని సీజ్ చేయడంతో పాటు పట్టుబడిన బియ్యాన్ని జంగారెడ్డిగూడెం గోడౌన్‌కు తరలించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

సూక్ష్మ ప్రణాళికల అమలుతో పోలింగ్‌ను పెంచాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఏలూరు జిల్లా అధికారులు

ఏలూరు(మెట్రో): రాష్ట్రంలో త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ నమోదు శాతాన్ని విస్తృత స్థాయిలో పెంచే లక్ష్యంతో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా స్వీప్ సూక్ష్మ ప్రణాళికలను అమలు పర్చాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా జిల్లాల స్వీప్ నోడల్ అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం స్వీప్ అధికారుల బృందం రాష్ట్రానికి వచ్చిన సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో క్రమబద్ధమైన ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్య కార్యక్రమాల అమలుపై అన్ని జిల్లాల స్వీప్ నోడల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏలూరు జిల్లాలో అమలు చేస్తున్న ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్య కార్యక్రమాలను ఏలూరు జిల్లా స్వీప్ నోడల్ అధికారి టి.శ్రీనివాస్ విశ్వనాథ్ పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా భారత ఎన్నికల సంఘం అధికార బృందం సభ్యులకు వివరించారు. సమావేశంలో భారత ఎన్నికల సంఘం స్వీప్ అధికారుల బృందం సభ్యులు రాహుల్ కుమార్, ఆర్.కె.సింగ్ తో పాటు అదనపు సీఈఓ ఎమ్ఎన్ హరెంధిర ప్రసాద్, డిప్యూటీ సీఈఓ ఎస్.మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానానికి ఊతం

- ఉద్యాన సాగు పెంచేలా ప్రభుత్వ చర్యలు
- భారీస్థాయిలో రాయితీలు
- సమీకృత ఉద్యాన మిషన్ ద్వారా యాంత్రీకరణకు చోటు

ఏలూరు(మెట్రో): రైతుకు అన్ని పంటల్లోనూ సాయాన్ని అందిస్తూ రైతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. కేవలం ఒకే పంటను రైతన్నలు పండించకుండా అనేక రకాల పంటలను సాగు చేసుకునేందుకు జగనన్న సర్కారు చర్యలు తీసుకుంటుంది. దీనిలో భాగంగా ఓ వైపు వరి రైతును ప్రోత్సహిస్తూనే మరో వైపు ఉద్యాన పంటలను సైతం రైతులతో వేయించి వాటికి భారీస్థాయిలో ప్రోత్సాహకాలను అందిస్తోంది.

రైతులకు ప్రత్యేక సబ్సిడీలు

మామిడి వేసిన రైతుకు హెక్టారుకు రూ.7,980, అదే విధంగా జీడిమామిడి, కోకో వేసిన రైతుకు హెక్టారుకు రూ.12 వేలు, డ్రాగన్ ఫ్రూట్‌కు హెక్టారుకు రూ.30 వేలు, జామూన్ అండ్ జాక్ ఫ్రూట్ హెక్టారు సాగుకు రూ.18 వేలు, పూల సాగు ఏదైనా హెక్టారుకు రూ.16 వేలు, కూరగాయల సాగు ఏదైనా హెక్టారుకు రూ.20 వేలు సబ్సిడీ రూపంలో రైతులకు ప్రభుత్వం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటుంది. అదే విధంగా ఉద్యాన రైతుకు నీటి వసతి సైతం కల్పించేందుకు చర్యలు తీసుకుంటూ ఇంకుడు గుంత తవ్విన రైతుకు ఆ విస్తీర్ణాన్ని బట్టి రూ.75 వేల వరకూ , పాలీ హౌస్ నిర్మాణానికి రూ.2 లక్షలు, శీతల గిడ్డంగి వంటి నిర్మాణాలకు రూ.5.25 లక్షలు, అదే గ్రూప్‌లుగా రైతులు ఏర్పడి శీతల గిడ్డంగి నిర్మాణం చేసుకుంటే గ్రూపు మొత్తానికి రూ.9,37,500, అదేవిధంగా కలెక్షన్ సెంటర్‌లు ఏర్పాటు చేస్తే దానికి రైతు గ్రూపులకు రూ.11,25,000, రైతు ఒక్కడే అయితే రూ.5.25 లక్షలు సబ్సిడీల రూపంలో చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. వీటితో పాటు రైతు భరోసా కేంద్రాల ద్వారా కూడా రైతులకు అవసరమైన సాయాన్ని అందిస్తుంది.



బొప్పాయి సాగు చేస్తున్న దృశ్యం

ఏలూరు జిల్లాలో సాగు ఇలా

పంట రకం	విస్తీర్ణం(ఎకరాల్లో)
ఆయిల్‌పామ్	1,21,422
కోకో	32,452
కొబ్బరి	35324
మామిడి	37519
జీడిమామిడి	16,325
నిమ్మ	8285
అరటి	4418
బొప్పాయి	414

సమీకృత ఉద్యాన మిషన్ ద్వారా

సమీకృత ఉద్యాన మిషన్ ద్వారా రాయితీలు చెల్లిస్తూ యాంత్రీకరణను సైతం ప్రోత్సహిస్తోంది. యాంత్రీకరణలో భాగంగా మినీ ట్రాక్టర్‌కు రూ.75 వేలు, పవర్ ట్రిల్లర్‌కు రూ.4 వేలు, తైవాన్ స్ప్రేయర్‌కు రూ.4 వేలు, మొబైల్ మినిమల్ ప్రాసెసింగ్ యూనిట్‌కు రూ.10 లక్షలు సబ్సిడీల రూపంలో అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

రైతు సంక్షేమమే ధ్యేయం



రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం రైతులకు రాయితీలు అందిస్తోంది. ఉద్యాన రైతులను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటుంది. సమీకృత ఉద్యాన మిషన్ ద్వారా రైతులు పంటలకు, పంటలకు ఉపయోగపడే యాంత్రీకరణకు సైతం ప్రభుత్వం నిధులు చెల్లిస్తోంది. ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహకంతో రైతులు ఉద్యాన పంటలను సాగు చేసుకోవాలి. కేవలం ఎప్పుడూ ఒకే పంటపై ఆధారపడకుండా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు, రాయితీలను రైతులు ఉపయోగించుకోవాలి.

–బి.లావణ్యవేణి, జాయింట్ కలెక్టర్, ఏలూరు

రైతుల కష్టాలను తీర్చడానికే ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్‌లు

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: రైతులు నకిలీ విత్తనాలతో మోసపోకుండా ఉండేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలోనూ ఒక ఇంటిగ్రేటెడ్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ను ప్రభుత్వం మంజూరు చేసిందని తద్వారా రైతుల కష్టాలు తీరనున్నాయని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బుధవారం నరసాపురం వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో రూ.1.22కోట్లతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లు నాణ్యతా పరీక్షలకు భరోసా కల్పిస్తాయన్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో ఆర్బీకేలు రైతులకు సేవలందిస్తున్నాయన్నారు. నాసిరకం విత్తనాలు, పురుగుమందుల బారిన పడకుండా ఉండేందుకు ప్రభుత్వం అగ్రిల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. రైతులు సొంతంగా తయారు చేసుకున్న విత్తనాలు కాకుండా ఎరువులు, పురుగు మందులతోపాటు చేపలు, రొయ్యల చెరువులకు సంబంధించిన అన్ని రకాల టెస్టులను రైతులు ఉచితంగా పొందవచ్చునన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా నరసాపురం నియోజకవర్గంలో అన్ని మౌలిక వసతులతో కూడిన ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ను నిర్మించారన్నారు. ఈ భవనంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల టెస్టులు చేసేలా గ్రౌండ్ ఫ్లోర్‌ను, చేపలు, రొయ్యల చెరువులకు సంబంధించిన టెస్టులు చేసేలా మొదటి అంతస్తు నిర్మించామన్నారు. గతంలో రైతులు భూసార పరీక్షలకు డబ్బులు ఖర్చు చేయాల్సి వచ్చేదని ఇకపై ఎలాంటి ఖర్చులేకుండా ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లలో ఉచితంగా పొందవచుచనని ఎమ్మెల్యే సూచించారు. రైతులు కొత్త నైపుణ్యంతో అధునాతన పద్ధతులను పాటించి వ్యవసాయంలో అభాలు పొందాలని ప్రసాదరాజు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యులు బొక్కా రాధాకృష్ణ, తిరుమాని బాపూజీ, ఎంపీపీ మైలాబత్తుల సోని, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు, ఆత్మ చైర్మన్ కడలి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ఇంటిగ్రేటెడ్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

గ్రంథాలయాల ద్వారా స్వీయ అధ్యయనం సాధ్యం

జంగారెడ్డిగూడెం: స్వీయ అధ్యయనం ద్వారా విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించడానికి గ్రంథాలయాలు ఎంతగానో తోడ్పడతాయని ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్నవెంకటేష్ తెలిపారు. బుధవారం జంగారెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎస్ఆర్ నిధులు రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ గ్రంథాలయంలో నిశ్శబ్దంగా ఉండడం వల్ల విద్యార్థులు పుస్తకం పఠనానికి శ్రద్ధవహిస్తారని తద్వారా వారు మంచి విజ్ఞాన శక్తిని పొందుతారని అన్నారు. ప్రస్తుత సమాజంలో మొబైల్ ఫోన్లకు, టీవీలపై ఆధారపడి విద్యార్థులు ఉన్నారని వీటినుండి వారిని గ్రంథాలయ పఠనానికి మార్చడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఏలూరు జిల్లాలో ఆరు ప్రాంతాల్లో గ్రంథాలయాలను సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేస్తున్నామని అందులో ఏలూరులో కోట దిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.40 లక్షలతో, మిగిలిన 5 చోట్ల ఒక్కొక్కటి రూ.10 లక్షలతో డిజిటల్ గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఏలూరులో రెండు స్కూల్స్‌లో గ్రంథాలయాలు ప్రారంభమయ్యాన్నారు. వీటిలో నాణ్యతతో కూడిన ఫర్నీచర్, ప్రాధాన్యతా పుస్తకాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం లైబ్రరీను ప్రారంభించి, లైబ్రరీలోని ఫర్నిచర్‌ను, పుస్తకాలను పరిశీలించారు.



గ్రంథాలయ ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

- జీలుగుమిల్లి బాలుర వసతి గృహంలో కలుషిత ఆహార ఘటనపై మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణితో పాటు అధికారులను ఈ సంఘటనపై పూర్వాపరాలు పరిశీలన కోసం పంపామని, కలుషిత ఆహారానికి సంబంధించిన శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపామని వివరించారు. నివేదిక ఆధారంగా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి వసతి గృహంలో రాత్రి సమయాల్లో తప్పనిసరిగా వార్డెన్ బస చేయాల్సి ఉందని, లేని పక్షంలో ఫిర్యాదు చేస్తే వాటిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పోల్నాటి బాబ్జి, డీఈఓ ఎస్.అబ్రహం, హెచ్‌ఎం కేఎస్‌వీ లోవకుమారి, ఐటీడీఏ డీడీ నాయుడు, ఎంఈఓలు రాముడు, రాములు పాల్గొన్నారు.

త్వరలో అమెరికాలో శ్రీవారి కల్యాణం



ధర్మకర్తల మండలి సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ చైర్మన్ ఎస్‌వీ సుధాకరరావు

ద్వారకాతిరుమల: ఈ ఏడాది జూలై లేదా ఆగస్టు నెలలో చిన వెంకన్న కల్యాణ మహోత్సవాన్ని అమెరికాలో నిర్వహించాలని ఆలయ ధర్మకర్తల మండలి తీర్మానించింది. శ్రీవారి కొండపైన పద్మావతి కల్యాణ మండపంలో ఆలయ చైర్మన్ ఎస్‌వీ సుధాకరరావు అధ్యక్షతన బుధవారం ధర్మకర్తల మండలి సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో స్వామి వారి ప్రధాన ఆలయంతో పాటు, ఉప, దత్తత దేవాలయాలు, అనుబంధ సంస్థల ఆదాయ, వ్యయాలతో పాటు అభివృద్ధి పనులకు, బహిరంగ వేలం పాటల ద్వారా పలు దుకాణాలకు వచ్చిన హెచ్చు పాటలను, ఈ–ప్రొక్యూర్మెంట్, సీల్డ్ టెండర్లను ఆమోదించారు. ముఖ్యంగా ప్రవాస భారతీయుల ఆధ్వర్యంలో అమెరికాలో స్వామివారి కల్యాణాన్ని జరపాలన్న ప్రతిపాదనను ఆమోదించారు. కొండపైన పాడైన బోర్ల స్థానంలో మరో మూడు బోర్లు, అలాగే స్థానిక నృసింహ ఆలయం వద్ద ఒక బోరును, వాటికి పైప్ లైన్లను సుమారు రూ. 1 కోటి వ్యయంతో నిర్మించాలని తీర్మానించారు. సప్త గోకులం వద్ద గోవులకు దాణాగా అందించే పచ్చ గడ్డిని విక్రయించుకునే లైసెన్స్ హక్కునకు వేలం నిర్వహించాలని నిర్ణయించారు. స్వామివారి ప్రసాదాల తయారీకి వచ్చిన తక్కువ టెండర్‌ను ఆమోదించారు. అలాగే స్వామి వారికి హుండీల ద్వారా లభించిన 5 కేజీల మిశ్రమ బంగారాన్ని గోల్డ్ బాండ్ స్కీం కింద ఎస్‌బీఐలో భద్రపరచాలని నిర్ణయించారు. సమావేశంలో దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు, ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్‌వీ నివృతరావు, ట్రస్టుబోర్డు సభ్యులు నాళం కృష్ణ వీర సుబ్బలక్ష్మి, చిట్టూరి మణి, ముస్సే శ్రీను, పెద్దిరెడ్డి పద్మ జ్యోతి, మానుకొండ సుబ్బారావు, తాణంకి గంగరాజు, పాయం మంగతాయారు, పాలా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

జంగారెడ్డిగూడెం రూరల్: వర్జీనియా పొగాకు రైతు సంఘం నాయకులు పలు సమస్యలను బుధవారం గుంటూరులో పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్, పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. రైతు సంఘం నాయకులు చైర్మన్, ఈడీని కలిసి సమస్యలపై వినతిపత్రాన్ని అందజేసి 1353 వంగడం అధికారికంగా విడుదలపై చర్యలు తీసుకోవాలని కోరారు. గడిచిన ఐదు సంవత్సరాలుగా పరిశోధన స్థాయిలో ఉన్న 1350, 1353 వంగడాలను కొంతమంది రైతులు సాగు చేసి అధిక దిగుబడితో పాటు నాణ్యమైన పొగాకును కూడా పండించారని రైతులు ఈడీ, చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. మిగిలిన వంగడాలతో పోలిస్తే ఈ వంగడాలు కండ కలిగిన పొగాకును అధికంగా ఉత్పత్తి చేయడంతో ఎకరాకు సుమారు 2 క్వింటాళ్ల పొగాకు అధికంగా ఉత్పత్తి అవుతుందన్నారు. ఈ పొగాకు తుఫాన్ వల్ల కురిసిన వర్షాన్ని తట్టుకుని మెరుగైన ఫలితాలను ఇస్తుందన్నారు, ఆకులు మందంగా ఉండి త్వరగా పండకుండా రెల్పులకు అనువుగా ఉంటుందని సుమారు 50 శాతం వరకు మందపాటి ఆకు ఉత్పత్తి చేస్తుందని, మంచి ఆదాయాన్ని ఇస్తుందని రైతులు చైర్మన్, ఈడీకి వివరించారు. ఈ వంగడంలో నికోటిన్ 2 నుంచి 4 శాతం స్థిరంగా ఉండడం వల్ల వ్యాపారస్తులు ఎలాంటి అభ్యంతరాలు తెలుపడం లేదన్నారు. ఈ రకం వంగడాలను అధికారికంగా విడుదల చేసి రైతులందరికీ అందుబాటులో ఉంచాలని కోరారు. చైర్మన్, ఈడీను కలిసిన వారిలో వామిశెట్టి హరిబాబు, సత్రం వెంకట్రావు, పరిమి రాంబాబు, వీవీఎస్ ప్రకాష్, అల్లూరి సోమేశ్వరరావు, గద్దే శేషగిరి రావు తదితరులు ఉన్నారు.



పొగాకు బోర్డు ఈడీకి వినతి పత్రాన్ని అందజేస్తున్న వర్జీనియా రైతు సంఘం నాయకులు


కొప్పాకలో భారీ చోరీ



కొప్పాకలో చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సైలు

పెదవేగి : భార్య పిల్లలతో కలసి అత్తగారింటికి వెళ్ళి వచ్చేసరికి ఇంట్లో బంగారం నగదు దోచుకుపోయారని ఓ వ్యక్తి పోలీసులను ఆశ్రయించాడు. పెదవేగి ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం కొప్పాక గ్రామంలో పామర్తి రాము అనే వ్యక్తి భార్య పిల్లలతో కలిసి ముసునూరు మండలం గోపవరం గ్రామంలోని అత్తగారింటికి ఈ నెల 20న సాయంత్రం వెళ్లాడు. తిరిగి మరుసటి రోజు ఈనెల 21న ఉదయం 10 గంటలకు వచ్చేసరికి పామర్తి రాము ఇంటి తాళాలు పగులగొట్టి, బీరువా తాళాలు పగులగొట్టి అందులోని బంగారం, నగదు సుమారు రూ.5 లక్షల విలువైన వస్తువులను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారని పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. సంఘటనా స్థలాన్ని సీఐ కె. శ్రీనివాసకుమార్, ఎస్సై రాజేంద్రప్రసాద్ పరిశీలించారు.

తెలుగులో తీర్పులిచ్చిన న్యాయమూర్తి



ఎ.పవన్‌కుమార్

భీమవరం: మాతృభాషా దినోత్సవం రోజున భీమవరం, పాలకొల్లు కోర్టుల్లో సివిల్ కేసుల్లో తెలుగులో తీర్పు చెప్పి జడ్జి ఎ.పవన్‌కుమార్ మాతృభాషపై అభిమానం చాటుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. భీమవరం కోర్టు జడ్జితోపాటు పాలకొల్లు కోర్టులో జడ్జిగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్‌కుమార్ కోర్టు కేసుల్లో కక్షిదారులు తమ కేసు ఎందుకు గెలిచామో? లేక ఓడిపోయామో పూర్తిగా అర్థం కావాలంటే సాధ్యమైనంత వరకూ తీర్పులన్నీ సంబంధిత ప్రాంతీయ భాషల్లోనే ఉంటే బాగుంటుందని అభిప్రాయపడుతుంటారు. దీనిలో భాగంగా భీమవరంలోని న్యాయస్థానాల్లో న్యాయమూర్తిగా పనిచేస్తున్నప్పటి నుంచి సాధ్యమైనంత వరకూ తీర్పులను తెలుగు భాషలోనే ఇస్తున్నారు. ఆయన న్యాయమూర్తిగా పదవీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచీ ఇప్పటి వరకు సుమారు 25 కేసులకు సంబంధించి తెలుగులో తీర్పులందించారు. దీనిలో భాగంగానే మాతృభాషా దినోత్సవమైన బుధవారం భీమవరం, పాలకొల్లు కోర్టుల్లో రెండు కేసులకు సంబంధించి తెలుగులో తీర్పులిచ్చి మాతృభాషపై అభిమానాన్ని చాటుకున్నారు.

క్లుప్తంగా

నవాబుపాలెం సొసైటీ మహాజన సభ



తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెం మహాజన సభ దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నవాబుపాలెం సొసైటీ సాధారణ మహాజన సభ బుధవారం సొసైటీ ఆవరణలో సొసైటీ చైర్మన్ జడ్డు హరిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా 2024–25 సంవత్సరానికి గాను అంచనా బడ్జెట్, 71లక్షల ఆరు వేల 500 రూపాయలు అంచనాలను సమావేశం ఆమోదించింది. సభ్యులు మెహెర్‌ప్రసాద్, సొసైటీ కార్యదర్శి పీవీవీ.సత్యనారాయణ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తారని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులు చీకటిమల్లి మంగరాజు తెలిపారు. చంద్రబాబు ముప్పై ఐదు సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉన్నారని, కుప్పం నియోజకవర్గం నుంచి చంద్రబాబు పోటీ చేయరని, రెస్ట్ తీసుకుంటారని భువనేశ్వరీ బహిరంగంగా ప్రకటించడం అంటే చంద్రబాబును వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓడిస్తారనే భయంతోనే ఈ ప్రకటన వచ్చిందని మంగరాజు ఎద్దేవా చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబును వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓడిస్తే, రాష్ట్రంలోని మిగిలిన ఎమ్మెల్యేల పరిస్థితి ఏమిటి ? అని ప్రశ్నించారు. చంద్రబాబుకు రెస్ట్ అంటే లోకేష్, భువనేశ్వరీలు బాబుకు వెన్నుపోటు పొడిచినట్లేనని జోస్యం చెప్పారు. లోకేష్ సైతం మంగళగిరిలో ఓడిపోతాననే భయంతో ఉన్నారంటే రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 175కి 175 సీట్లుతో గెలవడం ఖాయమని ఆయన తెలిపారు.

దేశాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తజనం



కుంచనపల్లి గ్రామంలో దేశాలమ్మను దర్శించేందుకు క్యూకట్టిన భక్తులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి గ్రామంలో పునఃనిర్మించిన దేశాలమ్మ వారి ఆలయానికి బుధవారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని వివిధ ప్రాంతాల్లో ఉన్న గ్రామానికి చెందిన ఆడపడుచులు భారీగా తరలివచ్చారు. దీంతో ఆ ప్రాంతం కిక్కిరిసింది. అమ్మవారికి ధాన్యాధివాసం, జలాధివాసం, క్షీరాధివాసం, పుష్పాధివాసంతో పాటు రుద్ర, చండీ హోమాలు, పుణ్యాహవచనం వంటి పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు కృష్ణమోహన్ శర్మ నిర్వహించారు. తొలుత అమ్మవారిని గోవు దర్శించిన తర్వాత భక్తులకు అవకాశం కల్పించారు. అనంతరం శిఖరంపై నుంచి బూరెలు పోసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ప్రసాదాన్ని చేజిక్కించుకునేందుకు భక్తులు గుమికూడారు. ఆలయ సమీపంలో భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం పూర్ణాహుతితో ప్రతిష్ఠా మహోత్సవాలు ముగిశాయి. అమ్మ వారిని జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, సీహెచ్ఏఆర్‌కే.వర్మ ప్రభృతులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ సోమా మురళీకృష్ణ, కనుపూరి ఉదయ్‌భాస్కర్, గుమ్మళ్ల తాతారావు, మేకా శ్రీను, శ్రీనివాస్, మునీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడేవారికి పార్టీలో గుర్తింపు

భీమవరం: కష్టపడి పనిచేసే వారికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. పార్టీ భీమవరం పట్టణ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కందికట్ల నాగరాజు ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేయాలని ఆయనకు ఎమ్మెల్యే సూచించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని చెప్పారు. చెల్లబోయిన సూర్యప్రకాష్, గంటా సుందర్‌కుమార్, పెదపాటి ప్రసాద్, వాసర్ల ముత్యాలరావు పాల్గొన్నారు.

26 నుంచి రక్షణ సువార్త సభలు

పెంటపాడు: ఈనెల 26 ,27 తేదీల్లో పెంటపాడు పీహెచ్‌సీ సమీపంలో రక్షణ సువార్త సభలు నిర్వహిస్తున్నట్లు యూనివర్సల్ ప్రేయర్ హౌస్ వ్యవస్థాపకురాలు యార్లగడ్డ రావిని ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళంకు చెందిన దైవసేవకులు బ్రదర్ పీపీ స్వామి ఈ సభలలో దేవుని వాక్యం అందిస్తారని, పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

యానాదుల కాలనీకి మోక్షం



నాడు పూరిపాకలతో యానాదుల కాలనీ



నేడు యానాదులకు నిర్మించిన నూతన గృహాలు



యానాదుల కాలనీ నిర్మాణానికి వేసిన శిలాఫలకం

- 20 ఏళ్ల సమస్యకు మోక్షం
- 32 కుటుంబాలకు గూడు

తాడేపల్లిగూడెం: ఎన్నో ఏళ్లుగా ఇబ్బంది పెడుతున్న యానాదుల కాలనీకి మోక్షం లభించింది. కాలనీ నిర్మించడంతో ఒక పక్కా గూడు దొరికింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి అమలు చేస్తున్న నవరత్న పథకాలు సంక్షేమ నవశకానికి నాంది పలికాయి. సీఎం జగన్ చేపట్టిన సుదీర్ఘ ప్రజా సంకల్ప పాదయాత్రలో నిలువ నీడ లేకుండా పేదలు పడుతున్న దుర్భర పరిస్థితులను స్వయంగా చూసిన ఆయన అధికారంలోకి రాగానే పేదలందరికీ పక్కా గృహాలు కట్టించి ఇస్తానని మాట ఇచ్చారు. మాట తప్పని, మడమ తిప్పని మనస్తత్వం కలిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదలందరికీ ఇళ్లు పథకానికి శ్రీకారం చుట్టి దేశ చరిత్రలో తొలిసారిగా లక్షలాది ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. అంతటితో ఆగకుండా ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన వనరులు సమకూర్చుతూ ఇళ్లు నిర్మించుకోవడానికి తోడ్పాటును అందించారు. దీంతో పూరి గుడిసెలు, అద్దె ఇళ్ల నుంచి నిరుపేదలకు ఉప శమనం లభించింది. ప్రభుత్వ సహకారంతో పేదోడి సొంతింటి కల సాకారమవడంతో పాటు వారి జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయి. వైఎస్సార్ జగనన్న కాలనీలు కొత్త ఊళ్లను తలపించేలా రూపుదిద్దుకుంటున్నాయి. తాడేపల్లిగూడెం పట్టణంలోని 33 యానాది కుటుంబాలకు పక్కా గూడు దొరికింది. ఆ కుటుంబాల్లో ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఎండకు ఎండి, వానకు కూలే పూరిపాకలే వారికి నీడనిచ్చేవి. ఇలా తాడేపల్లిగూడెం ప్రాంతంలో వెలివేసిన కుటుంబాల మాదిరి పట్టణానికి దూరంగా పొలాల మధ్యన ఉన్న గుడిసెలే ఆవాసంగా వారి బతుకు బరువుగా సాగింది. 20 ఏళ్లుగా యానాదుల గురించి పట్టించుకున్న వారు లేరు.వారంటూ ఒకరున్నారనే స్పృహ కూడా పాలకులకు లేదు.

నాడు కడకట్లకు మారుమూల ప్రాంతంలో

పట్టణంలో ఒక పల్లె ప్రాంతంగా కనిపించే కడకట్ల చెరువు పక్కగా సుమారు రెండు కిలోమీటర్ల దూరం దాటి చేలల్లో పంట బోదెల పక్కన బతికే బతుకు యానాదులది. తాగేందుకు సురక్షిత నీరు లేదు. ఉండేందుకు సరైన నీడ లేదు. రాకపోకలు సాగించేందుకు రహదారి సౌకర్యం లేదు. వానాకాలంలో మోకాళ్లకు పైగా కూరుకుపోయిన దారిలో అష్టకష్టాలు పడాల్సిందే. అయినా వీరిని పట్టించు కున్న నాథుడులేడు. ఎన్నికల సమయంలో మాత్రం యానాదుల సంఘ నాయకులను ప్రసన్నం చేసుకొని, వీరి ఓట్లను వేయించుకొనే పరిస్థితి. పిల్లి పిల్లలను పెట్టి ఏడిళ్లు తిప్పినట్టు ఇవతలి చేను గట్టు కాదంటే ఆవలి చేనుగట్టు అన్నట్టుగా వీరి గుడిసెల నివాసాలు కూడా మారుతుండేవి.

నేడు పక్కా ఇళ్లు

యానాదుల జీవితాల్లో వెలుగులు నింపేందుకే, వారికి పక్కా గూడు కల్పించేందుకు ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖామంత్రి కొట్టు సత్యనారాయణ కార్యాచరణ చేశారు. పక్కా ప్రణాళికతో కడకట్ల నుంచి పెదతాడేపల్లి వెళ్లే పుంత మార్గంలో 33 యానాదుల కుటుంబాలకు పక్కా ఇళ్లు కట్టించడానికి శ్రీకారం చుట్టారు. 2022 మే 27న 59.40 లక్షల రూపాయలతో ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఇళ్లు నిర్మించి విద్యుత్ సౌకర్యం కల్పించారు. పక్కా రహదారిని ఏర్పాటు చేశారు. వీధిలైట్లు వేశారు. 33 కుటుంబాలలో సంతోషాన్ని చిరునామాగా నిలిచారు.

20 ఏళ్ల సమస్య తీరింది



20ఏళ్లుగా యానాదుల ఇళ్ల సమస్య పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు సమర్పిస్తూనే ఉన్నాం. కాని పట్టించుకున్న నాథుడు లేడు. అరకొర సౌకర్యాలు. పూరిపాకల్లో యానాదులు బతుకులు వెళ్లదీశారు. సీఎం జగన్ సారథ్యంలో డిప్యూటీసీఎం , దేవదాయశాఖామంత్రి కొట్టు సత్యనారాయణ మా సమస్యకు పరిష్కారం చూపించారు. 33 మంది యానాదుల కుటుంబానికి నీడ కల్పించారు.

– మేకల ఏడుకొండలు, యానాదుల సంఘ రాష్ట్ర నాయకుడు

భయంతో వణికి పోయేవాళ్లం



పూరి గుడిసెల్లో భయంభయంగా గడిపే వాళ్లం . తుపానుల సమయంలో పిల్లా జల్లాతో నిదుర లేకుండా ఉండే వాళ్లం. భయంగా ఉండేది. పాములు పక్క నుంచి వెళ్లిపోయేవి. కొన్ని సార్లు కరిచినప్పుడు చావుల వరకు వెళ్లాం. ఈ ప్రభుత్వం మా గోడు ఆలకించి పక్కా ఇళ్లు ఇచ్చి, సౌకర్యాలు ఇచ్చారు ధన్యవాదాలు.

– కొమరగిరి దానమ్మ

జగనన్నకు రుణపడి ఉంటాం



20 ఏళ్లుగా గుడిసెల్లో బతికే వాళ్లం. మాకు జగనన్న పక్కా ఇళ్లు కట్టించారు. రోడ్డు వేయించారు. కరెంటు ఇచ్చారు. మా పిల్లలు బడికెళ్లడానికి అవకాశం ఇచ్చారు. జగనన్నకు రుణపడి ఉంటాం.

– మేకల నాగలక్ష్మి

అమర వీరుల సేవలను మరిచిపోరాదు



సమావేశంలో మాట్లాడుతున్న భోగేశ్వరరావు, తదితరులు

పెంటపాడు: దేశానికి స్వాతంత్ర్యాన్ని అందించిన అమరవీరుల త్యాగాలను ప్రజలు సదా గుర్తించుకోవాలని టీబీఆర్ సంస్థల అధినేత, రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘ అధ్యక్షుడు టి భోగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం అల్లంపురం టీబీఆర్ సైనిక్‌స్కూల్‌లో ఎయిర్ కమాండర్ నితిన్‌సాతే(పూణే) కల్నల్ తదితరులు స్థానిక విద్యాసంస్థను సందర్శించారు. ఈ సందర్భంగా స్కూల్ వద్ద అమరజవాన్స్ స్థూపానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడూతూ నేషనల్ డిఫెన్స్ అకాడమీపై పలు విషయాలను విద్యార్థులకు తెలియజేశారు. అలంపురంలో మిలటరీ డిఫెన్స్ అకాడమి స్థాపించేందుకు ఒక వినూత్న కార్యక్రమానికి భోగేశ్వరరావు రూపకల్పన చేసారని, నితిన్‌సాతే పేర్కొన్నారు. విద్యాసంస్థల నుంచి దేశానికి సేవ చేసేందుకుగాను ఆర్మీ ఆఫీసర్స్‌ను తయారు చేసే కార్యక్రమం రూపొందించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ రవికిరణ్, ప్రిన్సిపాల్ ఫర్వీన్‌కుమార్‌శర్మ, హెచ్‌ఎం కల్యాణి, ఎన్‌సీసీ అధికారి ధనరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు కుంచనపల్లిలో సకల జన సమ్మేళన పాదయాత్ర

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం 4 గంటలకు సకల జన సమ్మేళన పాదయాత్ర కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు తెలిపారు. డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, సర్పంచ్‌లు, ఎమ్పీటీసీలు, కార్పొరేషన్ డైరెక్టర్లు, పార్టీ శ్రేణులు హాజరు కావాలని హరిబాబు కోరారు.

శ్రీశ్రీ సేవా విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో రెడ్ బుక్స్ డే



తణుకులో మాట్లాడుతున్న డీవీవీఎస్ వర్మ

తణుకు: ప్రపంచ రెడ్ బుక్స్ డే పురస్కరించుకుని శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం తణుకులో సదస్సు నిర్వహించారు. కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పి.దక్షిణామూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో డీవీవీఎస్ వర్మ మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలో ఎదురవుతున్న సమస్యలకు రెడ్ బుక్స్‌తోనే పరిష్కారం దొరుకుతుందన్నారు. ఈ దోపిడీను అంతం చేసేందుకు ఉద్యమాలు, పోరాటాలు మార్గమనే విషయాన్ని ఈ పుస్తకం వెల్లడించిందని ఆయన గుర్తు చేశారు. దక్షిణామూర్తి మాట్లాడుతూ సమకాలీన, ఆర్థిక, రాజకీయ అంశాలకు రెడ్ బుక్స్‌లో పరిష్కారం దొరుకుందని ప్రతి ఒక్కరు అధ్యయనం పట్ల శ్రద్ధ పెంచుకోవాలని కోరారు. ఈ సదస్సులో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్, ఐలూ జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సంకు మనోరమ, శ్రామిక మహిళా జిల్లా నాయకులు ఎ.అజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలను నాటుతున్న భవిత సెంటర్ విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక వాసవి వనిత క్లబ్ అందజేసిన మొక్కలను బుధవారం పట్టణంలోని భవిత సెంటర్ ఆవరణలో దివ్యాంగులచే నాటించారు. భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయులు బాలీశ్వరయ్య, మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బి.జ్యోతిలు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషి చేద్దామని, ప్లాస్టిక్ సంచులు వాడటం మానేయాలని, గుడ్డ సంచులను ఉపయోగిద్దామని విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్కూల్ ఆవరణలోను, పరిసరాలలోను స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ప్రత్యేక ఉపాధ్యాయులు ఎం.చంద్రకుమారి, అంగన్‌వాడీలు, ఉపాధ్యాయులు. పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తణుకు పట్టణాన్ని కప్పేసిన మంచు దుప్పటి



తణుకు పై ఓవర్ పై అలముకున్న మంచు తెరలు



ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మంచు దుప్పటి

తణుకు: తణుకు పట్టణాన్ని మంచు దుప్పటి కప్పేసింది. గత కొద్ది రోజులుగా పొగ మంచుతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. బుధవారం తెల్లవారుజామున తణుకు పట్టణంలోని మంచు కురవడంతో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. శివరాత్రి సమీపిస్తుండటంతో సాధారణంగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతూ ఉంటాయి. అయితే ఇటీవల కాలంలో జిల్లాలో రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుతున్నాయి. మరోవైపు పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ఎండవేడిమికి ప్రజలు అల్లాడిపోతున్నారు. బుధవారం మధ్యాహ్నం 36 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఇదిలా ఉంటే బుధవారం తెల్లవారుజామున కురిసిన పొగమంచు కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉదయం 9 గంటలకు సైతం మంచు తెరలు వీడకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు అవస్థలు పడ్డారు.

రోటరీ సేవలు అభినందనీయం

పాలకొల్లు సెంట్రల్: రోటరీ క్లబ్ గవర్నర్ జోన్‌లో పాలకొల్లు క్లబ్ అందించే సేవలు అభినందనీయమని క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు దత్త అన్నారు. బుధవారం గవర్నర్ అఫీషియల్ విజిట్‌లో భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ కన్వెన్షన్ హాలులో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యంగా మైండ్ ఫీస్‌పుల్‌పై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని రోటరీ క్లబ్ నిర్ణయించడం జరిగిందన్నారు. నేడు ముఖ్యంగా విద్యార్థులు చిన్న వయస్సులోనే ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితులు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు.

ప్రపంచంలోనే గొప్పది మాతృభాష



అత్తిలి: బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న తెలుగు ఉపాధ్యాయుడు



అత్తిలి: బల్లిపాడులో విద్యార్థుల నృత్య ప్రదర్శన దృశ్యం

అత్తిలి: మాతృభాష ప్రపంచంలోనే గొప్పదని, తల్లి ఉగ్గుపాలతో నేర్పిన భాషను అందరూ నేర్చుకుని ప్రపంచ మేధావులు కావాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్‌సీఎం దత్ చెప్పారు. అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో హెచ్‌ఎం దత్ మాట్లాడుతూ ఇతర భాషలు ఎన్ని వచ్చినా, మాతృభాషలో మాట్లాడితే మాధుర్యం కలుగుతుందన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ తెలుగు ఉపాధ్యాయుడు చదరం వెంకట్రావు పిల్లలను ఉద్దేశించి మాతృభాష గొప్పతనాన్ని వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, ఆలపించిన పాటలు సభికులను ఆకట్టుకున్నాయి. మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు పి రాంబాబు, సీహెచ్ బాలసుబ్రహ్మణ్యం, ఎస్ పురుషోత్తం, శ్రీహర్షద్, మాధవ పాల్గొన్నారు.

తెలుగు భాష అభివృద్ధికి యువత కృషి చేయాలి

తాడేపల్లిగూడెం రూరల్: తెలుగు భాష అభివృద్ధికి యువత కృషి చేయాలని వికీపీడియా కమ్యూనిటీ మేనేజర్ పవన్ సంతోష్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం, తెలుగు సాహితీ సమాఖ్య స్వర్ణోత్సవాలను బుధవారం సాయంత్రం మండలంలోని పెదతాడేపల్లి శ్రీరామా విద్యానికేతన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా 'రేపటి తెలుగు' అనే అంశంపై ఆయన మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను తెలుగు భాషకు అనుసంధానం చేస్తే భాష మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. తెలుగు సాహితీ సమాఖ్య అధ్యక్షుడు మండ బ్రహ్మాజీ, పూర్వాధ్యక్షుడు ఈతకోట తాతాజీ, లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, ఆంధ్రప్రదేశ్ నాటక పరిషత్‌ల సమాఖ్య ప్రతినిధి బుద్దాల వెంకటరామారావు మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య ప్రధాన కార్యదర్శి పైలు శ్రీనివాసరావు, పూర్వాధ్యక్షుడు కోపల్లె శ్రీనివాస్, సూరంపూడి వెంకటరమణ, పి.మూర్తినాయుడు, కోశాధికారి నాగేంద్ర, పీటీ వెంకన్న, గోదావరి ప్రభాకర శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషతోనే పురోగతి

తణుకు టౌన్: తెలుగు భాషా పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, తెలుగు భాష మాధుర్యాన్ని భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తాడేపల్లిగూడెం డీఆర్‌జీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు, కవి సుంకర గోపాలయ్య చెప్పారు. బుధవారం తణుకులోని ఎస్కేఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్‌కే ఫణిధర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపాలయ్య మాట్లాడుతూ మన మాతృ భాషతో పాటు ఇతర భాషలను కూడా అభ్యసించాలని, అలా అని మాతృ భాషను నిర్లక్ష్యం చేయకూడదని చెప్పారు. మాతృభాష యొక్కల విలువలను ఆయన విద్యార్థులకు వివరించారు. ఈకార్యక్రమంలో కళాశాల విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో....

మాతృ భాషను ప్రతీ ఒక్కరూ పరిరక్షించుకోవాలని తణుకు సాహితీ సామ్రాజ్యం సాహితీ సంస్థ అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు చెప్పారు. ప్రపంచ మాతృభాషా దినోత్సవం సందర్భంగా తణుకులోని రూట్స్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషతో సంస్కృతీ సంప్రదాయాలను కాపాడటానికి కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సాహితీ సంస్థ సభ్యులు ఎం మోహనరావు, కేవీఎస్‌డీ ప్రసాద్, ఎండీ ఆలంగీర్‌బాషాలను ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న వికీపీడియా కమ్యూనిటీ మేనేజర్ పవన్ సంతోష్



తణుకు టౌన్: ప్రపంచ మాతృభాషా దినోత్సవం సందర్భంగా సాహితీ సంస్థ సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం